Postal Regd.No. VSP-142/2009-2011

★ యేసుక్రీస్తు అందరికి ప్రభువు

# క్రైస్తవనాడు

ఆధ్యాత్మిక, సామాజిక వార్తా పక్షపత్రిక

CHRISTAVANAADU
Telugu Fortnightly
e-mail: christavanaadu1@yahoo.co.in


Head Office : D.No. 3-178, 5th Lane,
ADARSH NAGAR, VISAKHAPATNAM-530 040
ANDHRA PRADESH, INDIA.

RNI APTEL /2006/17980
(REGISTRAR OF NEWS PAPERS FOR INDIA)
www.christavanaadu.com

Published from VISAKHAPATNAM | సంపుటి : 5 | సంచిక : 5 | ఎడిటర్ : వై.కనకరాజు | 2010 అక్టోబర్ 16-31 | పేజీలు : 8 | వెల : 5/-

★ రాబోవు దినములలో చిరకాలము వరకు నిత్యము సాక్ష్యార్థముగానుండునట్లు నీవు వెళ్లి వారి యెదుట పలకమీద దీని వ్రాసి గ్రంథములో లిఖింపుము.

★ ఈమాటలు నమ్మకమును నిజమునైయున్నవి గనుక వ్రాయుమని ఆయన నాతో చెప్పుచున్నాడు




దైవత్వాన్ని గూర్చి లోకాన అనేక తర్క వితర్కాలను మనం వింటుంటాం. దేవుని ఉనికిని గూర్చి ఒక్కొక్కరు ఒకోలా చెబుతుంటారు. ఎవరి సిద్ధాంతాలను వారు ఆచరిస్తూ వాటిని అనేకులకు బోధిస్తుంటారు. ఎవరేమి బోధించినా... అత్యధిక శాతం వారు మాత్రం తమ పాపాలు పోవాలంటే దేవునికి బలి ఇవ్వాలనే నమ్మిక గలవారిగానే కనబడ్తారు. తమ తమ స్తోమతలను బట్టి పక్షులనుండి జంతువుల వరకు అనేకరకాల జీవులను బలియిస్తుంటారు. ఆయా బలుల ద్వారా అప్పటి వరకు తాము చేసిన పాపాలు తుడిచి పెట్టుకుపోతాయనే నమ్ముతారు. దీన్ని గూర్చి లోకంలో గల అనేక గ్రంథాల్లో వ్రాయబడినట్లును చూడగలం. చరిత్రలోను బలులను గూర్చి చదవగలం. క్రైస్తవులు దేవుని గ్రంథంగా నమ్మే బైబిల్లోను బలులను గూర్చి వ్రాయబడింది. యేసుక్రీస్తుకు ముందున్న తరమువారు తమ పాపాలను పోగొట్టుకొనేందుకు దేవునికి బలులు అర్పించినట్లు బైబిల్లోను చూడగలం. కొన్ని లేఖనాల భావము సంపూర్ణంగా గ్రహిస్తే దేవుని ఉద్దేశ్యం అర్థమై ఎవరికైనా ఆశ్చర్యం కల్గిస్తుంది. లేఖనాలను గ్రహించే క్రైస్తవులు సంభ్రమాశ్చార్యాల్లో మునిగిపోతారన్నది నిర్వివాదాంశం. ఎందుకంటే క్రైస్తవుల్లో అనేకులు లేఖన మర్మాలు అర్థంకానివారిగానే ఉండుట చూడగలం. దానిక్కారణం... మూస బోధలే! ఆయా బోధకులకు అలవాటు పడి లేఖనాలను సంపూర్ణంగా గ్రహించేందుకు వారు లేఖనాలను పరిశోధించక పోవుటయే! అందుకు తగిన వివరణ ఈ శీర్షికకు అంతగా అవసరం లేదని భావిస్తూ 'దేవుని గొర్రెపిల్ల'ను గూర్చి తెలుసుకుంటూ ముందుకు సాగుదామా మరి!

బైబిల్లో మన ప్రభువైన యేసుక్రీస్తుని గూర్చి 'దేవుని గొర్రెపిల్ల' అని వ్రాయబడిన లేఖనాన్ని పైన మీరు చదివారు. దేవునికి గొర్రె పిల్ల అవసరమా? లేక దేవునికి గొర్రెపిల్ల ఉందా? ఉంటే ఎందుకుంది? దాంతో దేవుడేమి చేయదలచుకున్నారు? యిత్యాది ప్రశ్నలనేకం ఉదయించక మానవు. ఆయా ప్రశ్నలకు సమాధానము బైబిలు ప్రకారం తెల్సుకొంటుంటే... మానవులను తమ పాపాలనుండి విముక్తుల్ని చేయుటకు, వారి మరణాంతరం తనయొద్దకు వారిని తిరిగి చేర్చుకొనుటకు దేవుడింత ప్రణాళికను ఏర్పరచారాయని ఆశ్చర్యపోవుట ఖాయం. అందువల్ల అది తెలుసుకున్న వారెవరైనా హృదయ పూర్వకంగా దేవునికి చేతులు జోడించక మానరు. *(వచ్చే సంచికలో)*

### కామన్‌వెల్త్ క్రీడాకారులను
## అభినందించిన సోనియా గాంధీ



కామన్‌వెల్త్ క్రీడల్లో పతకాలు సాధించి దేశానికి పేరు ప్రతిష్టలు తెచ్చిపెట్టిన క్రీడాకారులను కాంగ్రెస్ అధ్యక్షురాలు సోనియాగాంధీ కలుసుకున్నారు. 19వ కామన్‌వెల్త్ క్రీడలకు భారత్ ఆతిథ్యం ఇవ్వడం, అందులో 101 పతకాలు సాధించి దేశాన్ని రెండోస్థానంలో నిలవడం ఎంతో సంతోషంగా ఉందని సోనియాగాంధీ క్రీడాకారులకు అభినందనలు తెలిపారు. ముమ్మందూ ఇలాగే మన దేశానికి పేరు తేవాలని ప్రతి ఒక్కరిని ఉత్సాహపరుస్తూ శుభాకాంక్షలు తెలిపారు.

## నేర శిక్షలో మార్పులు



ఒకే తరహా నేరానికి భిన్నమైన శిక్షలు విధించే విధానాలను సమూలంగా మార్చనున్నట్లు కేంద్ర న్యాయశాఖ మంత్రి వీరప్ప మొయిలీ తెలిపారు. అమెరికా, బ్రిటన్ దేశాల తరహాలోనే ఈ మార్పులు ఉంటాయని స్పష్టం చేశారు.

## విదేశీ పెట్టుబడులకు ఆటంకం కల్గించబోమని ముఖర్జీ స్పష్టీకరణ



విదేశీ పెట్టుబడుల ప్రవాహానికి ఆటంకం కలిగించే యోచన లేదని ఇండియా స్పష్టం చేసింది. ఈ విషయాన్ని వుడ్‌రో విల్సన్ సెంటర్, ఫిక్కీ సంయుక్తంగా ఏర్పాటు చేసిన ఒక కార్యక్రమంలో కేంద్ర ఆర్థిక మంత్రి ప్రణబ్ ముఖర్జీ స్పష్టం చేశారు.

## స్టాట్యూ ఆఫ్ సర్దార్

గుజరాత్‌లోని నర్మదా ఆనకట్ట వద్ద 182 మీటర్ల ఎత్తున్న 'సర్దార్ వల్లభాయ్ పటేల్' భారీ ప్రతిమను ఆ రాష్ట్ర సీఎం నరేంద్రమోడీ నెలకొల్పాలని నిర్ణయించుకున్నారు. 'స్టాట్యూ ఆఫ్ లిబర్టీ' ఎత్తుకంటే రెండు ఇంతలు పెద్దదైన ప్రతిమను నెల కొల్పనున్నట్లు మోడీ ప్రకటించారు.

ఇప్పుడు వెబ్‌సైట్‌లో... క్రైస్తవనాడు www.christavanaadu.com




## భారత్‌కు ఒబామా రాక!



పార్లమెంటు శీతాకాల సమావేశాలు వచ్చే నెల 9నుంచి ప్రారంభం కానున్నాయి. నవంబర్ 5న భారత్‌కు ఒబామా ఐదురోజుల పర్యటన నిమిత్తం రానున్నారు. ఆయన ఉభయ సభల సంయుక్త సమావేశంలో 8న ప్రసంగిస్తారని రాజ్యసభ అధికార వర్గాలు తెలిపాయి.

***లోకోక్తి :*** బంగారు భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని ఈ రోజు మనం ప్రజల్ని విద్యావంతుల్ని చేయాలి
- జాన్ ఎఫ్.కెన్నడీ (అమెరికా మాజీ అధ్యక్షుడు)

## విశాఖ CBCNC హిల్‌క్రెస్ట్ & రాక్‌డేల్ స్థలాలు

**అమ్మకాల్లో తిరిగి వుంచుకుంటున్న ఆక్రమణ దారులు?**
**ఇది కోర్టు ధిక్కారమంటున్న నాయకులు!**
**అసాంఘిక కార్యక్రమాలకు నిలయాలు?**

సిబిసిఎన్‌సి ఆస్తులు ఎందరో క్రైస్తవులకు భావితరాల్లో ఉపయోగకరంగా ఉండాలని భావించారు నాటి మిషనరీలు. అందుకు విరుద్ధంగా గ్రూపులు కట్టి దొరికినకాడికి దొరికినంత తెగనమ్ముకున్నారు కొందరు. వాటిపై అనేక వ్యాజ్యాలు అనేక సంవత్సరాలుగా కోర్టుల్లో నడుస్తున్నాయి. అలాంటి వాటిల్లో విశాఖలో అతి ఖరీదైన ప్రాంతాల్లోనున్నవే హిల్‌క్రెస్ట్ & రాక్‌డేల్ స్థలాలు. ఈ స్థలాల్లో రాత్రివేళల్లోను, ఒక్కోసారి పగటిపూట కూడా అసాంఘిక కార్యక్రమాలు జరుగుతున్నాయని, అదెంతమాత్రము మంచిది కాదని సిబిసిఎన్‌సి నాయకుల్లో చర్చలు జరుగుతున్నాయి. ఈ విషయాన్ని కోర్టు దృష్టికి, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి దేవుని ఆస్తులు కాపాడేందుకు మరికొందరు నాయకులు ప్రయత్నిస్తున్నారని తెలుస్తోంది. జరగబోయేదేంటో చూడాల్సిందే! ఈ విషయంలో దేవుని తీర్పు ఎలా ఉంటుందోనని అనేకమంది విశ్వాసులు ఎదురుచూస్తున్నారు. ఆస్తులు సద్వినియోగమవాలన్నదే అనేకుల ప్రార్థన.

★ సహోదరులు ఐక్యత కలిగి నివసించుట ఎంత మేలు ఎంత మనోహరము

# క్రైస్ట్ సాల్వేషన్ చర్చ్ వ్యవస్థాపకులు, సీనియర్ పాస్టర్ బి.జె.వి. ప్రసాద్

## తొలి జ్ఞాపకార్థ కూటమి

క్రైస్ట్ సాల్వేషన్ చర్చ్ & విశ్వాసులు






సీనియర్ పాస్టర్
**బి.జె.వి. ప్రసాద్**
1944 - 2009

చర్చిలో ప్రసంగిస్తున్న దృశ్యం



▼ ప్రభువునందు నిద్రలో...






▲ ఏ.ఐ.సి.సి. మీటింగులో క్రైస్తవ నాయకునిగా...

నిద్రించిన తరువాత కూడికలో ఆయన కుమారుడు రెవ.డా.బి.డేవిడ్ కిరణ్ కుమార్ తండ్రిసేవలను గుర్తుచేసుకున్న దృశ్యం. ▼





***నర్సీపట్నం, అడ్డురోడ్డు అక్టోబర్ 17:*** సీనియర్ పాస్టర్, క్రైస్ట్ సాల్వేషన్ చర్చ్ వ్యవస్థాపకులైన బి.జె.వి. ప్రసాద్ గతేడాది అక్టోబర్ 17న ప్రభువునందు నిద్రించారన్న సంగతి క్రైస్తవనాడు పాఠకులకు విధితమే. తొలి జ్ఞాపకార్థ కూటమి ఈ నెల 17న ఆయన కుమారుడైన రెవ.డా.బి. డేవిడ్ కిరణ్ కుమార్ ఘనంగా జరిపారు. ఈ కూడికలో అడ్డురోడ్డు పరిసర మండలాల కాపర్లే గాక అనేకమంది విశ్వాసులు, ఆయన కుటుంబీకులు, స్నేహితులు హాజరై ఆయనతో తమకు గల అనుబంధాన్ని పంచుకున్నారు. తండ్రి స్థాపించిన సేవను కుమారుడు మరింత ముందుకు తీసుకువెళ్ళాలని ఆకాంక్షించారు.తండ్రి పేరును నిలబెడుతూ సేవను బలంగా జరుపుటలో రెవ.డా. బి.డేవిడ్ కిరణ్ కుమార్ ఇప్పటికే అనేక చోట్ల పేరెన్నికగన్నారని సంతోషం వెలిబుచ్చారు. సేవలో ఆయన మరింత బలపడి అనేకులకు ఆధరణగా సహకారులుగా ఉంటూ ప్రసిద్ధి చెందాలని తద్వారానే ఆయన తండ్రియైన సీనియర్ పాస్టర్ బి.జె.వి. ప్రసాద్ కోరిక నెరవేరుతుందని తమ అభిప్రాయాన్ని వ్యక్తపరిచారు. అనేకులు తనపై ఉంచిన నమ్మకాన్నే గాక తన యెడల కలిగియున్న దేవుని సంకల్పాన్ని సంపూర్ణంగా నెరవేర్చుటకు శాయశక్తుల కృషి చేస్తానని రెవ.డా.బి. డేవిడ్ కిరణ్ కుమార్ చెప్పారు. ఆ విషయంలో ఇప్పటికే ఆయన ఎందరికో మాదిరి ఉన్నారని పాల్గొన్న వారిలో అనేకులు తమ అభిప్రాయాన్ని వెలిబుచ్చుతూ సాక్ష్యమిచ్చారు. రాబోవు రోజుల్లో ఆయన సేవా పరిచర్యలెలా ఉంటాయో చూడాల్సిందే!



యెహోవాయందు నమ్మకముంచువాడు వర్ధిల్లును-బైబిల్

**SAHITHI CERAMICS**



**ALL WALL & FLOOR TILES**

SANITARY WARE

#48-1-22/2, Srinagar, Near Ramatalkies, Visakhapatnam-16

Phone : 0891-6455880, Mobile : 92 91 49 18 15

**క్రైస్తవనాడు లో ప్రకటన ధరలు**

వివరాలు సంపూర్ణంగా తెల్సుకొనేందుకు సంప్రదించండి!

| B&W | FULL PAGE | HALF PAGE | QTR. PAGE |
|---|---|---|---|
| FRONT PAGE | ***** | 4,500/- | 2,250/- |
| CENTRE PAGES | 5,000/- | 2,500/- | 1,250/- |
| REAR PAGE | 8,000/- | 4,000/- | 2,000/- |

| COLOUR | FULL PAGE | HALF PAGE | QUATER PAGE |
|---|---|---|---|
| FRONT PAGE | ***** | 9,000/- | 4,500/- |
| CENTRE PAGES | 8,000/- | 4,000/- | 2,000/- |
| REAR PAGE | 16,000/- | 8,000/- | 4,000/- |

ఫోన్ : 9346960601, 9490266640, 9292006116

Syam Thota (TSR) యెహోవాయందు నమ్మకముంచువాడు వర్ధిల్లును-బైబిల్

**Sahithi Jewellers**

BODWIN COMPLEX, SHOP NO. : 6

D.NO. : 25-8-270, NEAR READING ROOM,

VISAKHAPATNAM -530 001

Phone : 0891-6588102, Mobile : 8019465576

# క్రైస్తవనాడు

ఆధ్యాత్మిక, సామాజిక వార్తా పక్షపత్రిక




సంపుటి:5 సంచిక:5 16-31 అక్టోబర్, 2010

★ ★ ★

## కేరాఫ్ అడ్రస్ ఎవరు?!

వయసొచ్చిన తర్వాత కూడా మీకు గుర్తింపునిచ్చేది మీ తల్లిదండ్రులా? అత్తమామలా? లేక కుటుంబంలో ఉన్న మరో పేరెన్నికగన్నవారా? వాళ్ల పేర్లు చెప్పుకొంటెనే లోకంలో ఎవరైనా మిమ్మల్ని గుర్తిస్తే మీ బ్రతుకులు క్రీస్తులో లేనివే! క్రైస్తవులమని చెప్పుకొంటున్నా.. మీరు యేసుక్రీస్తుకి శిష్యులు కారు.లోకంలో ఎందరిలానో బ్రతికేవాళ్ళ కోవకే చెందుతారన్నది ఎరగండి. క్రైస్తవులకు ఇదెంత మాత్రము తగదంటున్నారు వాక్య ప్రేమికులు. బైబిల్లో గల దేవుని మనస్సు అర్థంకాని వారే అలాంటి బ్రతుకులు బ్రతుకుతూ... క్రీస్తులో నిర్వీర్యులుగా ఉంటారని క్రీస్తు శిష్యులనేకులు అట్టివారిని గూర్చి చెబుతుంటారు. కాబట్టి తండ్రి, తల్లి, మామ, అత్త మొదలగు పేరెన్నికగన్న క్రైస్తవులనిపించుకుంటున్న వారి పేర్లనే చెప్పుకు బ్రతికే పిల్లలారా! క్రీస్తు శిష్యుల మాటల్లో గల 'ప్రేమను' గ్రహించండి. క్రైస్తవుల జీవితాలకు కేరాఫ్ అడ్రస్ యేసుక్రీస్తే అయ్యుండాలి. తద్వారానే క్రైస్తవులందరూ దేవుని పిల్లలుగా చెప్పుకొను భాగ్యాన్ని దేవుడిచ్చారని బైబిలు చెబుతుంది. అలా అవాలంటే యేసుక్రీస్తు అప్పగించిన పరిచర్యల ద్వారా మాత్రమే సాధ్యం. అందుకు మనందరం దేవుని కలిగుండాలి. అప్పుడే మనం దేవుని పిల్లలంగా లోకంలో అనేకులచే గుర్తించబడి మహిమపర్చబడతాం. అందువల్ల మాత్రమే మన ప్రభువును మృతులలోనుండి లేచుటలో జ్యేష్టుడు అయిన యేసుక్రీస్తు ద్వారా మన 'కేరాఫ్ అడ్రస్' తండ్రియైన దేవుడే కాగలరు. ఇది సత్యదేవుని నిత్య సంకల్పం. దేవుని అభిష్టాన్ని నెరవేర్చుటకు ప్రయత్నించువారందరికి ఈ లోకంలో గుర్తింపు తప్పక వస్తుంది. అది దేవుని చిత్తమైయున్నది. ఆ చిత్తాన్ని నేరవేర్చువారందరూ లోకంలో ఘనతకు పాత్రులవగలరు. అట్టివారిన బట్టే దేవుడు మహిమ పొందగలరు. మీరట్టి కోవకు చెందినవారో కారో మిమ్మల్ని మీరే పరీక్షించుకోండి. అట్టి మహిమ పొందినవారందరూ మొదట్లో 'కేరాఫ్ అడ్రస్'గా దేవుని పేరును చెప్పుకున్నా.. చివరాఖరుకు దేవునికే 'కేరాఫ్ అడ్రస్'గా మారగలరు. అట్టి ధన్యత మనకూ ఇచ్చిన, ఇస్తున్న 'దేవునికి స్తోత్రము'

**అబ్రహాము,ఇస్సాకు,యాకోబుల దేవుడను అన్న దేవుని సాక్ష్యం బైబిల్లో మీరు చదువలేదా? మత్తయి, మార్కు, లూకా, యెహాను, పౌలు తదితర పేర్లను పలుకకుండా తండ్రియైన దేవుని, కుమారుడైన యేసుక్రీస్తును ప్రకటించగలరా? చూచారా! వారంతా దేవునికే 'కేరాఫ్ అడ్రస్'గా మారారు. ఆహా ! దేవుడెంత మంచివారో కదా. అన్పించుటలేదూ... అన్పిస్తే 'దేవునికి స్తోత్రము' చెల్లించండి.**

★ "ప్రభువు వాక్యము శీఘ్రముగా వ్యాపించి మహిమ పరచబడు నిమిత్తము...... మా కొరకు ప్రార్థించుడి"

గమనిక : మీ రచనలు, వ్యాసాలు, ప్రసంగాలు, కవితలు, పద్యాలు, ఏవైనా సరే మేము ప్రచురించాలంటే భారతదేశ సార్వభౌమత్వానికి, భారత రాజ్యాంగానికి భిన్నంగా ఉండరాదు. లోకోక్తులు, టిప్స్, జనరల్ స్టడీ బిట్స్ సేకరణలని గమనించగలరు.

'వివేకియైనవాడు తన విద్యను దాచి పెట్టును' అన్న బైబిలు వాక్యాన్ని బట్టి వై.కె.రాజు, వై.ఎల్. రవిరాజుల రచనల్లోగల వాక్యాలకు ★ గుర్తు ఇవ్వడమైంది.

క్రైస్తవనాడులో ప్రచురించబడే ఇతరుల రచనలు ఆయా రచయిత / రచయిత్రిల వ్యక్తి గత అభిప్రాయాలు మాత్రమే. పత్రిక పాలసీకి ఎటువంటి సంబంధం లేదు. అడ్వర్టైజ్ మెంట్స్‌పై స్పందించే ముందు క్షుణ్ణంగా విచారించుకోండి. ఈ పత్రికకు ఏ విధమైన సంబంధంలేదు.

క్రైస్తవనాడు విస్తరించేందుకు చందాలు పంపి సహకరించండి.మీ అనుదిన కుటుంబ ప్రార్థనల్లో గుర్తుచేసుకొండి. మీ స్నేహితులకు పరిచయం చేసి ప్రోత్సహించండి.

**CHRISTAVANAADU** ON LINE A/C — Current Account No. : 13 96 111 00 00 00 52
**Andhra Bank,** Adarsh Nagar Branch, Visakha-530 040.

సం॥ చందా రూ. **200**/-లు. చందాదారులకు పెళ్లి, పుట్టినరోజు, స్మారక ప్రకటనలు **ఉచితం!** చందాదారులకు మాత్రమే రెగ్యులర్‌గా పంపబడుతుంది. పత్రిక అందని చందాదారులు ఉత్తరాల ద్వారా మాత్రమే ఆ సంగతి మాకు తెలియజేయాలి. లేకుంటే మేం భాధ్యత వహించలేం. పాఠకులిది గమనించి సహకరించగలరు. -ఎడిటర్. సంప్రదించండి : 9490266640, 9346960601.

## దేవుని జ్ఞానం - మానవ విజ్ఞానం 77

బైబిల్ / దేవుని మాట × సైన్స్ / శాస్త్రజ్ఞుల మాట



వై.ఎల్. రవిరాజు

"క్రైస్తవనాడు" ద్వారా అనేకులకు మేలు కలుగుటకై విజ్ఞాన విషయాలను అనగా నేటి వరకూ సైన్స్ సాధించిన ప్రగతిని గూర్చి వివరిస్తూ, ఆ ప్రగతి అంతయు దేవుని అనంత జ్ఞానంలో కొంతమాత్రమే అని తెలలియజేప్పుటకు చేయు ప్రయత్నమే ఈ "దేవుని జ్ఞానం - మానవ విజ్ఞానం " శీర్షిక ముఖ్యోద్ధేశము.

ఆలోచన మనిషిని నడిపిస్తున్న సాధనం. మనిషి జీవిత కాలంలో ఆలోచనే ముఖ్య భూమిక పోషిస్తుంది. అది మంచిదైనా, చెడ్డదైనా మన జీవితాన్ని అదే నడిపిస్తుంది. కొందరి ఆలోచనలు సమాజానికి కీడు దిశగా ప్రయానిస్తుంటాయి. గాని అవే ఆలోచనలు మేలుకై వినియోగిస్తే ప్రపంచమంతా శాంతివంతమగుతుందనుటలో ఎలాంటి సందేహం లేదు. శాంతి కలగాలంటే కేవలం యేసుక్రీస్తు వలనే అవుతుందని బైబిల్లో లేఖనాలు చెబుతున్నాయి. శాంతి సమాధానాలకు కర్తయైన యేసుక్రీస్తు తన జీవితకాలంలో తన స్వజనుల యెదుట అనేక కార్యాలు, బోధనలు, స్వస్థతలు చేసారు. అయినా సరే ఆయన చేసిన సేవలు ఎంతో మంది గుర్తించకపోగా అనేక విమర్శలు చేసి ఆయనను కించపరిచారు. చివరకు ఆయనను 'శిలువ వేయండి' అన్న నినాదాలు చేసేంతగా అప్పటి తరం వారున్నారని బైబిల్లో చూగడలం. అందుకు అక్షరసాక్ష్యంగా బైబిల్లో **'వారి కేకలే గెలిచెను'** అని వ్రాయబడింది. చూచారా యేసు దేవుని ఆలోచనల చొప్పున నడిచినందుకు లోకులచే వ్యతిరేకించబడ్డారు. శిలువ వేయబడ్డారు. ఆ జనుల యెదుట చేసిన ఆశ్చర్యకార్యాలు, క్రియలు, బోధలు ఎందరు గుర్తించారు? మరెవరు వాటి విషయమై ఆలోచించారు? వారేగాని ఆలోచించగలిగితే నాడు యేసు శిలువ వేయబడేవారే కాదు. తన కుమారున్ని చంపేస్తున్నారని, వారిని అంతం చేయాలని దేవుడు ఆలోచించలేదు. వారి దురాలోచనలో కూడా దేవుడు మనపై ప్రేమతో మన రక్షణకు సంబంధించిన క్రియలనే జరిగించారు. తద్వారా మన నిమిత్తమై రక్షణను ఏర్పాటుచేసారు. చూచారా దేవుని ఆలోచనలు మన జ్ఞానానికి ఎంత అతీతమో. **యేసే గాని శిలువ వేయబడకపోతే మనకు నేడు రక్షణ అనేది ఉండేదే కాదు. యేసు 'క్రీస్తు'గా పిలువబడేవారే కాదు. లోకానికి శకపురుషుడు అయ్యివుండే వారే కాదు.** యేసుక్రీస్తు తదనంతరం ఆయన శిష్యులు బోధించేటప్పుడు....

**★ మీరు సిలువవేసిన యీ యేసునే దేవుడు 'ప్రభువు' గాను 'క్రీస్తు'గాను నియమించెను.**

నాడు జనసమూహాలకు శిష్యులు హెచ్చరిస్తూ బోధిస్తున్న సందర్భంలో పై మాటను వారికి చెప్పారు.

**★ వారు ఈ మాటలు విని హృదయములో నొచ్చుకొని...**

ఈ మాటలను విన్న వారు ఆలోచించుట మొదలు పెట్టడం ప్రారంభించారు. తమ హృదయంలో నొచ్చుకున్నారని వ్రాయబడింది. నొచ్చుకొనుటను మూల బాషలో 'పొడువబడి' అని చెప్పబడింది. యేసుక్రీస్తు బ్రతికున్నప్పుడు ఆయనను శిలువ వేయండి అని కేకలు వేసిన జనసమూహాల్లో అనేకులు తర్వాతి దినాల్లో మార్పు చెందినట్లు బైబిల్లో చదివి గ్రహించగలం. అలా నాడు వారి హృదయాల్లో గల మలినాలను యేసు రక్తంలో కడుగుకొనుటకు సిద్దపడ్డారు. అందుక్కారణం వారిలో కలిగిన దైవాలోచనలే. వారు ఆలోచించడం ఎప్పుడైతే మొదలుపెట్టారో వెంటనే వారు బాప్తిస్మం పొందారు. మారుమనస్సు పొందుటకు అంగీకరించారు. దీనిబట్టి మార్పుకు పునాది ఆలోచనేనను‌ట నిర్వివాదాంశం. నేడు క్రైస్తవులైతే వారి ఆలోచనలు వారికోసమే గాని దేవుని కోసం ఏమాత్రం ఆలోచించుట లేదనుట కొంత బాధకరమే. ఎందుకంటే క్రైస్తవులందరూ దేవుని ఆలోచనల నిమిత్తం బ్రతికితే ఇప్పటికే ప్రపంచమంతా దేవున్ని అంగీకరించి యుండేది.. అందరూ క్రైస్తవులుగానే పిలువబడేవారు. ఎవరు చేయవలసిన పని వారు ఆలోచించి చేయకపోవుట వలనే ఈ దుస్థితి. ఎవరి కుటుంబం పట్ల వారు ఆలోచించే దాంట్లో కొంతైనా దేవునికోసం ఆలోచిస్తే వారి జీవితాలకు మంచిదని మరోసారి విన్నవించుకుంటున్నా. మీరు దేవునికై ఆలోచించండి. దేవుడు మీకోసమే కాదు గాని మీ వారందరికోసం ఎంతో ఉన్నతంగా ఆలోచిస్తారు. ఎందుకంటే మనం మన వారి కోసం ఆలోచించేది వారు మన కళ్లముందు ఉన్నంతవరకే గాని, దేవుడు వారు ఎక్కడ ఉన్న వారికి కాపుదలను ఇస్తారు. మనలో అనేకులు వేరే మతాలలో నుండి దేవుని మార్గంలోకి వచ్చినవారమే. అలా రావటానికి కారణం ఏంటని ఎప్పుడైన ఆలోచించారా? అసలు ఎందుకు వచ్చాం? అని ఇప్పుడైన ఒకసారి ఆలోచించరా? ఆలోచిస్తే మీకే అర్థమైపోతుంది దేవుని ఏర్పాటు ఏంటో! ఏ మనిషినైనా మనకు అవసరమైతేనే ఉద్యోగాల్లో నియమించుతాం. మనకు అనవసరంగా ఏ ఉద్యోగిని నియమించముగదా! మరి దేవుడు కూడా మనతో పని ఉందనే పిలిచుంటారని గ్రహించాలి. ఆ పని ఏంటో మనం గుర్తించగలిగి ముందుకు సాగాలి. ముమ్ముందుకు సాగేట్లు దేవుడే సహకరిస్తారన్నది మా భరోసా. అంతేగాని దేవుని చేతిలో పనికిరాని సాధనంగా మారుట ఎంతవరకు న్యాయం? ఆలోచించాలి. మనం ఆయన చేతిలో బాణాలమే గాని పనికిరాని సాధానాలం కామని గుర్తించండి. పనికిరాని వాటిని ఏమంటారో తెలుసుకదా! వ్యర్థమైనవంటారు.అంటే ఎందుకు పనికిరానివని. అదే ఇంగ్లీషులోనైతే 'స్క్రాప్ మెటీరియల్' అంటారు. ఇంగ్లీషులో ఎందుకు చెప్పానంటే కొందరు తెలుగు స్పష్టంగా మాట్లాడగలిగి కూడా ఇంగ్లీషులో పండితులుగా కన్పర్చుకోవాలని ప్రయత్నిస్తుంటారు. అందుకే ఇంగ్లీషులో చెప్పాను. ఇప్పటికే మీలో ఎవరైనా దేవుని చేతిలో అలాంటి పనికిరాని సాధానాలుగా ఉంటే మారండి! అట్టివారిని దేవుడు వాడుకోరు. పారవేస్తారన్నది గుర్తించండి. దేవుని చిత్తం తెలుసుకొని పనికొచ్చే సాధనంగా తయారవ్వండి. తన బిడ్డలందరిని ఉన్నత స్థితికి చేర్చాలన్నదే దేవుని కోరిక.

గమనిక: మునుపటి సంచికల్లో గల కొన్ని శీర్షికలు అనేక మంది పాఠకుల కోరికపై మరలా వీలును బట్టి ఇస్తున్నాం. అందువల్ల కొన్ని రిపీట్ అవుతున్నాయి గమనించగలరు.

★ ముందు జరిగినదే ఇప్పుడును జరుగును; జరుగబోవునది పూర్వమందు జరిగినదే; జరిగిపోయినదానిని దేవుడు మరల రప్పించును

వై.కనకరాజు, వై.ఎల్. రవిరాజులు వ్రాస్తున్న ప్రతి వివరణ అప్పటికి తగినంతమాత్రమే. సంచలనాత్మక విషయాలు, త్వరలో అని ప్రకటించినవి వీలును బట్టి ప్రచురిస్తాం! పాఠకులిది గమనించగలరు. అందుకై తదుపరి సంచికలు ఫాలో అవ్వండి.

క్రైస్తవనాడు డిటిపి, పేజ్‌మేకింగ్, డిజైనింగ్ : వై.ఎల్. రవిరాజు

**చేసింది చేసినట్లు... చేయంది చేయనట్లు... చెబుతుంది 'క్రైస్తవనాడు'. అందెట్టి పక్షపాతమూ లేదు. తరతమ బేధాలు అసలే లేవు. లోక ఐశ్వర్యాల కోసం కాదు మా ఆరాటం! క్రీస్తు ఐశ్వర్యం కోసమే మా పోరాటం!! పొందిన క్రీస్తు ఐశ్వర్యాన్ని అనేకులకు చేరివేయుటకే మా ఆరాటం!!! తద్వారానే 'క్రైస్తవనాడు'కు ఆశీర్వాదమన్నది బాగుగా ఎరిగినవారం. అందుకు సహకరిస్తున్న మీకూ మా వందనం.**

# దేహ విమోచనము

## Redemption of Body

(సెప్టెంబర్ 16-30 తరువాయి భాగం)

కొందరు మనము నిత్యము దేహవిమోచన కొరకు మూలుగుచునే యుండవలెయునా? తిరిగి జన్మించాము కదా? నీతిమంతులుముగా తీర్చబడ్డాము కదా? సరిపోదా? అనుకుంటారు. ఈ ప్రశ్నలకు జవాబులను శ్రద్ధగా చదువవలెనని నా విన్నపము.

### 11. తిరిగి జన్మించుట

(Regeneration)

ఈ అనుభవము పొందినవారు దేవుని కుటుంబములో సభ్యులౌతారు. **"తన్ను ఎందరంగీకరించెదరో వారికందరికి అనగా తన నామమునందు విశ్వాసముంచినవారికి దేవుని పిల్లలగుటకు ఆయన అధికారము అనుగ్రహించెను."** యోహాను 1:12

### 2. నీతిమంతులుముగా తీర్చబడుట (Justification)

మనము దేవునితో సమాధానము గలవారమై ఆయన సన్నిధిలో నిలచియుండు స్థితిని తెలియజేయుచున్నది. **విశ్వాసమూలమున మనము నీతిమంతులముగా తీర్చబడి మన ప్రభువైన యేసుక్రీస్తు ద్వారా దేవునితో సమాధానము కలిగియున్నాము. రోమా 5:1.**

### 3. ప్రత్యేకింపబడుట

(Sanctification)

దేవుడు మానవుని తన కొరకు, తన ద్వారా పాపమునుండి ప్రత్యేకపరచుకున్నాడు. ఎందుకు? పరిశుద్ధమైన జీవితం అనగా దేవునికి ఇష్టమైన జీవితం జీవించాలని. **"పరిశుద్ధతలేకుండా ఎవడును ప్రభువును చూడలేడు"** హెబ్రీ 12:14. పాపమునుండి ప్రత్యేకింపబడుట ద్వారా ఒక వ్యక్తి గుణగణాలు పూర్తిగా మార్పునకు గురి అవుతాయి. అనగా అతడు దేవుని గుణాతిశయములను ప్రత్యక్షపరుస్తాడు.

### 4. దత్తపుత్రాత్మ

(Spirit of adoption)

దత్తత స్వీకారం ద్వారా ఒక వ్యక్తి కుటుంబములో నూతన స్థానాన్ని పొందుతాడు. అనగా అతడు "దత్తపుత్రుడవుతాడు, అతడు చట్టపరమైన వారసుడు అవుతాడు.

**దేవుని ఆత్మచేత ఎందరు నడిపింపబడుదురో వారందరు దేవుని కుమారులై యుందురు; అనగా ఆత్మచేత నడిపింపబడువారు దత్తపుత్రాత్మను పొందియున్నారు. రోమా 8:14, 15.**

దత్తత ద్వారా కుమారులమైన మనలోనికి నాయనా! తండ్రీ! అని మొరపెట్టు తన కుమారుని ఆత్మను దేవుడు పంపెను. **గలతీ 4:6.** ప్రియులారా! ఈ ఆత్మ మన పక్షమున విజ్ఞాపనము చేయగా మనము మూలుగుచున్నాము. **దత్తపుత్రత్వము** పొందలేనప్పుడు దేహవిమోచన అసాధ్యము అని లేఖనములు సెలవిస్తున్నాయి.

### 5. విమోచనము

(Redemption)

అత్యున్నతుడైన దేవుని పిల్లలమై, దత్తపుత్రాత్మను పొంది ఆయనకు వారసులమైన మనము; దేహములో నివసించుచున్నంతకాలము ప్రభువునకు దూరముగా ఉన్నామని ఎరిగియుండి; దేహమును విడిచిపెట్టి ప్రభువునొద్ద నుండుటకు ఇష్టపడుచున్నాము **(2 కొరింథి 5:7,8).** నిరంతరము దేవుని సన్నిధిలో నివసించాలనే ఆశ మనలను తొందర చేయుచుండగా ధైర్యము గలవారమై దేహవిమోచనము కొరకు కనిపెట్టుచున్నాము. ఇది దత్తపుత్రత్వమునకు క్రియారూపక సాదృశ్యము. కుమారులు, కుమార్తెలు అని పిలువబడుచున్న మనము దేహవిమోచన ద్వారా నిజమైన వారసులమవుదుము. ఇది శుభప్రదమైన నిరీక్షణ. ఇట్టి నిరీక్షణ గలవారమై మనము భక్తిలో ముందుకు సాగాలి.

పాఠకులారా! మనము మూలుగుచున్నది, మూలుగవలసినది దేనికొరకో అర్థమైనది కదా! దైవజనుడైన పౌలు సెలవిచ్చినట్లుగా మనము దత్తపుత్రత్వము కొరకు, తద్వారా పొందబోవు దేహవిమోచనము కొరకు మూలుగుచున్నాము. దేవునికి స్తోత్రం!

ఇప్పటివరకు మనుష్యులే మూలుగుచున్నారు అని మనకు తెలుసు. కానీ సృష్టి యావత్తు మూలుగుచున్నదని రోమా 8:20-22లో చదువగలము. సృష్టిమూలుగుట, ప్రసవవేదన పడుట ఏమిటి? దేనికొరకు? నాశనమునకు లోనైన దాస్యములోనుండి విడిపింపబడి, **దేవుని పిల్లలు పొందబోవు మహిమగల స్వాతంత్ర్యము పొందుదుమను నిరీక్షణ గలదై** స్వేచ్ఛగా కాక, దానిని లోబరిచిన వాని **మూలముగా వ్యర్థపరచబడెను గనుక సృష్టియావత్తు ఇదివరకు ఏకగ్రీవముగా మూలుగుచూ ప్రసవవేదన పడుచున్నదని ఎరుగుదుము. దేవుని కుమారుల ప్రత్యక్షత కొరకు సృష్టి మూలుగుచున్నది.** ఆ మూలుగు ఎలా ఉన్నది అంటే ప్రసవవేదనపడుచు తల్లి మూలుగు వలె ఉన్నది. దేనికొరకు ఈ ప్రసవవేదన అని అడిగితే, దేవుని పిల్లలు పొందబోవు మహిమగల స్వాతంత్ర్యము పొందుదుమను నిరీక్షణతో. గమనించారా! కుమారత్వములోని ఉన్నతమైన అనుభవము లోనికి మనము నడిపించబడాలని, సృష్టి యావత్తు మూలుగుచున్నది. ప్రియులారా! మనము ఎంత శ్రేష్ఠమైన వారమో ఆలోచించండి.

మూలుగుచున్న వారిలో మరియొకరు 'పరిశుద్ధాత్మ దేవుడు'. **ఉచ్చరింపశక్యముకాని మూలుగులతో ఆత్మ తానే మన పక్షముగా విజ్ఞాపనము చేయుచు, దేవుని చిత్తప్రకారము, పరిశుద్ధుల కొరకు విజ్ఞాపనము చేయుచున్నాడు. రోమా 8:26,27.** పరిశుద్ధులు సంపూర్ణులగుట ద్వారా వారు తన మహిమలో ప్రవేశింపవలెనని ఆత్మ విజ్ఞాపన చేయుచున్నాడు. దేవుడు తనను ప్రేమించిన వారిని పిలిచాడు; పిలిచిన వారిని నీతిమంతులనుగా తీర్చాడు; నీతిమంతులనుగా తీర్చిన వారిని మహిమపర్చాడు అని రోమా 8:28,29,30లో వ్రాయబడింది. ఈ మహిమపరచబడటం అను అనుభవం యేసుక్రీస్తును విశ్వసించిన ప్రతి ఒక్కరి జీవితపు చివరిఘట్టం. అపోస్తలుడైన పౌలు **మాకు ఏదురైన శ్రమలను, నిందలను తప్పించుకోవాలని మేము ప్రయత్నించుట లేదుగాని, అగ్నివంటి శ్రమలనైనను భరించుటకు మేము సిద్ధముగా ఉన్నాము. ఆలాగు సిద్ధపడుటకే మేము మూలుగుచున్నామని సెలవిస్తున్నాడు.** సాధారణముగా శ్రమలు తప్పించుకోవాలి గాని, సహించుటవలన ప్రయోజనమేమిటి? అని ఒక వ్యక్తి ప్రశ్న! ప్రియులారా,! యేసుక్రీస్తు దేవుని కుమారుడైయుండి కూడా శ్రమలు సహించి, **విధేయత నేర్చుకున్నాడు. శ్రమలు మనకు విధేయత నేర్పుతాయి.** అవిధేయత వలన మానవునికి మరణము ఎలా సంప్రాప్తమైందో, విధేయత వలన నిత్యజీవము అనుగ్రహింపబడినది. ఆ నిత్యజీవపు అధిపతి ప్రభువైన యేసుక్రీస్తు. పరిశుద్ధులు శ్రమలకు భయపడక, విసుగక, సహిస్తూ సంపూర్ణులవ్వాలని, అంతమందు వారు మహిమ పర్చబడాలని అనగా



రెవ.డా. ఎం. ఎ. పాల్

నిత్యమహిమలో చేర్చబడాలని పరిశుద్ధాత్ముడు మూలుగుచున్నాడు.

స్నేహితులారా! 'మూలుగుట' అను అనుభవములో ఇమిడియున్న దేవుని ఉన్నతమైన ఆలోచనను గూర్చి చదివారు కదా! మరి మీరు వేటికొరకు, దేనికొరకు మూలుగుచున్నారు? లోకసంబంధమైన వాటికొరకా? నిత్యత్వపు విలువల కొరకా? మీరు దత్తపుత్రత్వము కొరకు, దేహవిమోచన కొరకు, మహిమలో ప్రవేశము కొరకు నిత్యము మూలుగుచుండవలెనని, పరిశుద్ధాత్ముడు మీకు సహాయము చేయవలెనని నా ప్రార్థన.

### ప్రార్థనా ఫార్ములా

లోక రీతిగా మనము పొందిన వాటిని బట్టి స్తుతి చెల్లిస్తాము. ఆత్మీయులైనవారి స్థితి దీనికి భిన్నంగా ఉండాలి. అడిగి, స్తుతించి, పొందుకొని, దేవునిని స్తుతించాలి. అపోస్తలుడైన పౌలు ఇలా వ్రాస్తున్నాడు - **దేనిని గూర్చియు చింతపడకుడి గాని ప్రతి విషయములోను ప్రార్థన విజ్ఞాపనములచేత కృతజ్ఞతాపూర్వకముగా మీ విన్నపములు దేవునికి తెలియజేయుడి" (ఫిలిప్పీ 4:6).** మనము ఏదైనా దేవున్ని అడిగి దానిని బట్టి దేవునికి వందనాలు చెల్లించాలి. దేవుడు మన హృదయ వాంఛలను తీరుస్తాడు. ప్రార్థనకు అనుసంధానమైన స్తుతి దేవుని మీద మనకున్న బలమైన విశ్వాసానికి సూచన. దేవుడు అడుగువాటి నెల్లను దయ చేయువాడు అని నమ్మువారు వెంటనే స్తుతి చెల్లిస్తారు. కాబట్టి అడిగిన వాటిని పొందకముందు ఒక స్తుతి', వాటిని పొందిన తరువాత 'మరొక స్తుతి' చెల్లించాలి.

---

# యేసును చూడగోరెను గాని..!

ఒకానొక దినమున యెరికో పట్టణములో సుంకపు గుత్తదారుడు (Chief Tax Collector), ధనవంతుడును, అచటి జనులందరి దృష్టిలో పాపియైన మనుష్యుడగు జక్కయ్య అనునతడు సదరు నగర సంచారమున గల యేసును ఎవరోయని చూడగోరెను. ఆయన రాకతో చుట్టూ జనులు చేరి గుంపులుగా గుమికూడి యున్నందున భౌతికముగ పొట్టివాడైన జక్కయ్య యేసుని చూడగోరి ఆసక్తితో పరుగులు తీసి చెంతనున్న మేడి చెట్టెక్కెను.

యేసు ఆశ్చర్యకరుడని, ఆలోచన కర్తయని, సమాధానాధిపతియనియు ప్రవక్తయైన యెషయా (9:6) ముందుగా వ్రాసిన వివరణ జక్కయ్యకు తెలిసియున్నదా? ఆయనే రక్షకుడని (మత్తయి 1:21, లూకా 2:11), తన పాపములనుండి రక్షించునని తెలియునా? 'దేవుడు మనకు తోడు' అను అర్థమిచ్చు ఇమ్మానుయేలను (మత్తయి 1:23) పేరుగలవాడు, అభిషిక్తుడను క్రీస్తు (2:11) లేదా రాబోవు మెస్సీయ (యోహాను 4:25,26) ఆయనేయని గుర్తించినాడా? పెండ్లి కుమారుడు (మత్తయి 9:15), మనుష్యకుమారుడు (8:20) అని యేసుకు మారు పేర్లుగలవని వినియుండెనా? లేక జీవాహారము (యోహాను 6:51), వెలుగు (8:12), పరలోక మార్గము, సత్యము, జీవము (14:6) ఆయనేయని ఆయన తెలుపుట గమనించినాడా? దేవుని గొర్రెపిల్ల (1:29) అని కూడా పిలువబడినట్లు గ్రహించినాడా? యేసే ప్రభువని (అపొ.కా. 8:16 & ఎఫెసీ 5:20), కడపటి ఆదామని (1 కొరింథీ 15:45), సర్వాధిపతి (పాలించే రాజు) (1తిమోతి 6:15)యని, రాజులకు రాజు, ప్రభువులకు ప్రభువని (6:15), శ్రీమంతుడని (6:15) మరియు దేవునికి నరులకును మధ్యవర్తి (2:5)అని వినియున్నాడా? బహుశ ఆయన దావీదు సంతానమని (2తిమోతి 2:8) ఎరిగియుండవచ్చును. ఆయన ప్రధాన యాజకుడయినా (హెబ్రీ 6:20), సజీవమైన రాయిగా చెప్పబడినా (1పేతురు 2:4), ప్రధాన కాపరియైనా (5:4) లేదా అమూల్యమైన మూలరాయిగా పేర్కొనబడినా (2:6,7) ఆ విషయం జక్కయ్యకు తెలియక పోవచ్చును. యేసు దేవుని కుమారునిగా (1యోహాను 5:13) అంగీకరించబడినట్లు (మత్తయి 16:16) లేక యూదా గోత్రపు సింహమని (ప్రకటన 5:5) తెలియబడకపోవచ్చును. **దేవుని వాక్యమే యేసు నామమని (19:13) నేటికీ కొందరికి తెలియకున్నట్లు నాడు జక్కయ్యకు కూడ తెలియబడకపోవచ్చును.**

యేసు ఆ చోటికి వచ్చినప్పుడు మేడిచెట్టెక్కిన జక్కయ్యను కనుగొని అతన్ని చెట్టుదించి, యింట నంతోషముతో చేర్చు కొనబడి వానితో బసచేసెను. ఫలితముగా జక్కయ్య తన ఆస్తిలో సగము పేదలకును, అన్యాయముగ సంపాదించిన దాని



బ్రదర్ ఎస్.ఆర్. తిరుగుళ్ళ
చీపురుపల్లి

లో ఒకటికి నాలు గంతలు చొప్పున తిరిగి ఎవనిది వానికి చెల్లించుటకు నిర్ణయించెను. అతనిలో వచ్చిన మార్పుకు ప్రతిగా యేసు జక్కయ్య యింటికి రక్షణననుగ్రహించి, అతనిని కూడ అబ్రాహాము కుమారునిగా ప్రకటించుటయేగాక, తాను పరము నుండి ఇలకు దిగివచ్చిన కారణమును 'నశించిన దానిని వెదకి రక్షించుటకు మనుష్య కుమారుడు వచ్చెనని' అతనికి వ్యక్తపరచెను (లూకా 19:10)

## చాకిరేవు

-ఎడిటర్

**★ నన్ను చెరపవలెనని భక్తిహీనులు తమనోరు కపటముగల తమనోరు తెరచియున్నారు. వారు నా మీద అబద్ధములు చెప్పుకొనుచున్నారు. నన్ను చుట్టుకొని నా మీద ద్వేషపు మాటలాడుచున్నారు. నిర్నిమిత్తముగా నాతో పోరాడుచున్నారు.**

*(గతసంచిక తరువాయి)*

**★ ...ధనవంతుడును తన ప్రయత్నములలో** (నడకలలో) **వాడిపోవును.**

ఏదేమైనా క్రైస్తవులంతా ఐక్యతకల్గి తమకున్న పరిధిని బట్టి సఖ్యతతో మెలిగి ఒకరియందొకరు ప్రేమ కల్గి జీవించాలి. తద్వారా తమ మధ్యనున్న విబేధాల్ని వీడాలి. క్రీస్తుసేవా పరిచర్యలో మనమంతా ఒకటేనని లోకానికి చాటాలి.

సమస్యల్ని పరిష్కరించుకొని సేవ బలంగా జరుగునట్లు గొప్ప నిర్ణయాలు తీసుకోవాలి.

ఆయా నిర్ణయాలే 'క్రైస్తవ ఆస్తుల్ని' క్రీస్తుసేవకొరకు సద్వినియోగమైయ్యేట్లు చేయాలి. అపుడే క్రీస్తుకు మహిమ. మనలోనే ఆయన తన్నుతాను మహిమపర్చుకొంటారన్న లేఖనాన్ని నెరవేర్చుకొందాం. అదే క్రైస్తవులకాశీర్వాదం. ఇది అందరూ గ్రహించుట అవశ్యం. మనలోనున్న విబేధాలు క్రీస్తు సేవముందు ఎందుకూ పనికిరానివేనని గ్రహించుట అత్యవసరం. ఆలాగున జరిగితే సేవ ఇంకెంత బాగా సాగుతుందో ఆలోచించండి. **ఈ లోకంలో నుండి 'ఏ క్షణం'లో వెళ్ళిపోతామో ఎరుగని వారం. ఇక్కడ కళ్ళు మూయగానే అక్కడ ప్రభువెదురుగా కళ్ళు తెరిచాక ఏం చెబుతాం.** ప్రభువా నీకోసం గొప్పగా లోకంలో **బోధించామనా?** లేక **జీవించామనా? బోధించి జీవించకపోతే నిత్యనరకమంటోంది బైబిలు.** బోధించకపోయినా లేఖనానుకూలంగా జీవించుటకు ఇష్టపడితే ఆయనే మన బ్రతుకుల్ని అంతమువరకు సరిచేయును. **లోకంలో ఆస్తి ఆస్తి అంటూ వెంపర్లాడి క్రీస్తుకు దూరమైతే ఏం లాభం?** దేవుడు క్రైస్తవుల నుండి కోరేది ఇదేనా? ఆలోచించండి.

**ఒక మనుష్యుడు లోకమంతయు సంపాదించుకొని తన ప్రాణమును పోగొట్టుకొంటే తనకేమి ప్రయోజనము?** అన్న మన ప్రభువైన యేసుని ఒకసారైనా గుర్తుంచుకోండి. **ప్రతి ఆదివారం చర్చికెళ్తున్నాం, కానుకలేస్తున్నాం అంటే అది జీవానికి మార్గం కాదని ఎరగండి?!** ఆలాగుననే **సహోదరునికి లేమి కలిగుండుట చూచి, వెళ్ళు ప్రార్థిస్తాం అని చెప్పుట ప్రయోజనకారి కాదని** యాకోబులో చూస్తాం. క్రియలుండాలి మన విశ్వాసంలో అంటున్న బైబిలు మాటల్ని ఎల్లప్పుడు నెమరు వేసుకొని జీవించాలి. క్రీస్తు సేవకొరకు మనలో అక్కర గల వారికి సంపూర్ణ సహకారమందించువారే క్రైస్తవులు. సువార్తా పరిచర్యలకు సహకారులు. రాబోవు రోజుల్లోనైనా క్రైస్తవులందరూ సేవా సహకారులై క్రీస్తు రాజ్యము (సంఘము) విస్తరింపజేయుటలో వర్ధిల్లాలని ఆశిద్దాం.

## ★ భూమి యెహోవాది... తగవు వీళ్లది

**★ సమాధాన పరచువారు ధన్యులు; వారు దేవుని కుమారులనబడుదురు.**

దేవుని పట్టణమైన పరలోకంలో స్థానం పొందాలంటే ఇక్కడెలా జీవించాలో తెలపుటకు బైబిలు మనకొక చక్కని మార్గదర్శి. 'పరలోకం' **ఎవడు చూసాడు లెండి?!** అనుకొంటూ ఈ లోకమే శాశ్వతమనుకొంటూ బైబిలునందున్న **లేఖనాల్ని చులకనగా చూచేవారికి శ్రమ.** అట్టి వారెందరో తమ బ్రతుకుల్ని గూర్చి విశ్లేషణ చేసుకొంటే అవే చెప్తాయి. తావెంత ఆసమాధానాలతో దినములను గడుపుతున్నారో. అటువంటి జీవితాలనేనా క్రీస్తు ఈ లోకంలో మనకిస్తానన్నది? ఒకసారి ఆలోచించండి. క్రీస్తును ఎరిగిన తర్వాత తమ బ్రతుకుల్లో క్రీస్తుకు ప్రథమ స్థానమివ్వకుండా జీవించువారందరూ ప్రతిదినం అభద్రతాభావంతో జీవించాల్సిందే. కాబట్టి ఇక్కడ మన బ్రతుకులకు భద్రత, విశ్రాంతి కావాలంటే **క్రీస్తు మన జీవితాల్లో ఎదుటివారికి దర్శనమివ్వగలగాలి.** మన **కుటుంబాలకు ఆస్తుల నిచ్చుటకంటే క్రీస్తు నిచ్చుటకే అధిక సమయం వెచ్చించాలి.** ఈలాగున జీవించు వారెందరో మనకు తటస్థపడుతూనే ఉంటారు. వారి బ్రతుకుల్లో ఆస్తులు లేకున్ననూ క్రీస్తు ఇచ్చిన మహిమతో లోకంలో ఘనులుగా కన్పడుతుంటారు. తమ తమ కుటుంబాలతో సహా ఆశీర్వాదాలు పొందిన వారిగా కన్పడుతుంటారు. అట్టివారికి సహాయకులు క్రీస్తే సుమా!

ఒకనాటి మిషనరీలు క్రీస్తు సేవా పరిచర్యలు ఘనంగా జరగాలని, అందుకోసం తమవంతుగా ఇచ్చినవే మనకనేక చోట్ల కన్పడేస్థలాలు. వారివంతు వారు సేవలో ముగించుకొని తమకున్న క్రీస్తు ప్రేమను లోకానికి చాటారు. అందుకు నిదర్శనంగా అనేక పట్టణాల్లో ప్రముఖ వీధులు ఆయా వ్యక్తులు, వారికి సంబంధించిన పేర్లతో పిలువబడుతున్నాయి. ఈలోకంలో అదొక సాక్ష్యంగా మనం భావించాలి. అట్టి సాక్ష్యాన్ని మరింత ఘనంగా ప్రచురమయ్యేట్లు మనవంతుగా కృషిచేయాలి. అప్పటి ఆస్తులను గూర్చి క్రైస్తవపేర్లతో ఇప్పుడు లోకులు, మనము చెప్పుకొంటున్నాం. ఇప్పుడు మనవంతుగా మనమా ఆస్తుల్ని పరిరక్షిస్తూ క్రీస్తు సేవార్థమై సక్రమంగా వాడుకొంటే భావితరాల వారికి క్రీస్తును గూర్చి, మన గూర్చి అవే ఒక సాక్ష్యమై నిలుస్తాయి. ప్రస్తుత క్రైస్తవనాయకులుగా పరిగణింపబడుతున్న వారెవరైననూ అట్టి ఆస్తుల విషయమై శ్రద్ధ తీసుకోవాలని అధిక శాతం క్రైస్తవులు ఆశిస్తున్నారు. యేసుక్రీస్తు పరిచర్యలకొరకు అవన్నియు వాడబడాలని కోరుకొనే వారెందరో. వారి ప్రార్థనలు ఫలించాలని ఆశిస్తూ వీటి విషయమై ప్రతి వివాదము సమసిపోవాలని కోరుదాం. **పదిమంది మేలుకొరకు కోరే ప్రతి కోరికా తీర్చే దేవునినే మనం కలిగి ఉన్నాం.** మరెందుకాలశ్యం రండి మనందరంర ఏకమై కూడి ప్రార్థిద్దాం. దేవుడు మన మనవి వినును గాక! -ఆమెన్

# క్రైస్తవుల్లో "కులపిచ్చి" నిర్మూలణకో ఉద్యమం?!

క్రైస్తవులైన తర్వాత కూడా మనలో అనేకులు తమకులానికి సంబంధించిన తోకలను తగిలించుకుంటున్నారు. వారిలో పేరిన్నికగన్న వారూ ఉన్నారు. 'బోధలేమో ఘనం -మాదిరెమో హీనం' అన్న చందాన వారి వారి ప్రవర్తనలుంటాయి. ఈ కులపిచ్చి సంఘకార్యక్రమాల్లోనే గాక బయటవారి దగ్గరా చూపెడుతూ తమ కులదర్పాన్ని ప్రదర్శించువారూ ఎక్కువే. బోధల్లో మాత్రం 'పాతవి గతించెను' అంటారు. బ్రతుకులో మాత్రం అంతా పాతవాసనలే. ఇట్టి వారు లోకంలో తమకులాన్నే బహుగా ప్రకటించుకొనే వారి కోవకు చెందుతారు. వీరి ప్రచారరాల్లో కుల ప్రదర్శన ముందు! క్రీస్తు ప్రకటన వెనుక!! ఉంటుంది. అట్టి వారందరూ ప్రత్యక్షంగానే దేవునికి కులాన్ని అంటగట్టేస్తున్నారని ఎరగాలి. లేకుంటే క్రైస్తవనాడు దృష్టికి అటువంటివనేక సంగతులను తీసుకొస్తున్న వారే గాక క్రైస్తవనాడు పాఠకులూ ఓ 'ఉద్యమాన్నే చూపబడతామంటున్నారు. కులపిచ్చితో తమ పేర్లకు మూందూ వెనుకా తోకలను తగించుకొనే వారలారా జర జగ్రత్త!

## ' యేసుక్రీస్తు ఫోటో '

### ఇంట్లో ఉండొచ్చా? ఉండకూడదా?

వాక్యము దేవుడు అని ఘంటాపథంగా చెబుతున్న 'క్రైస్తవనాడు' పేపర్లో యేసుక్రీస్తు ఫోటో ఎందుకు వేస్తున్నారు? ఈ ప్రశ్న ఎస్ఎమ్మెస్‌గానూ మాకొచ్చింది. ఇదే అనుమానం ఏనాటినుంచో అనేక క్రైస్తవుల్లోనూ నానుతుంది. అది కూడా మా దృష్టికి ఎప్పుడో వచ్చింది. తగిన సమయమందు వివరించాలని మేం భావించాం. ఆ సమయం ఆసన్నమైంది. ఈ విషయంలో ఉన్న సందేహాలను పటాపంచలు గావిస్తూ వైకెయార్ వివరణ లేఖనానుసారంగా.... త్వరలో !

**చదవండి! లేఖనాల్లో బలపడండి!! అందరికీ తెలియజేయండి !!!**

## జర్నలిస్ట్ లేక రచయిత ఏం వ్రాయాలి? ఎలా ఉండాలి?

క్రైస్తవనాడు పాఠకులకో సదావకాశం!

**మీ అభిప్రాయాలు మాతో పంచుకోండి! వాటిని తదుపరి సంచికల్లో ప్రచురిస్తాం.**

సమాజానికి మేలుకలిగించే రచనలతో... అనేకులకు మాదిరి అన్పించే విధంగా జీవిస్తున్న మీకు తెలిసిన జర్నలిస్టులు, రచయితలను గురించి తెలియజేయండి. మీ వివరణలతోబాటు మీ ఫోటో పంపండి. వీలుంటే వారి ఫోటోలను కూడా పంపగలరు. ప్రచురించబడిన ప్రతి వివరణకు ప్రోత్సాహ కానుకగా రూ.500/-లు పంపబడతాయి. క్రైస్తవనాడు మరింత విస్తరించేట్లు మీ కుటుంబ ప్రార్థనల్లో గుర్తుచేసుకోమని కోరుతున్నా.

**మీకో 'అద్వితీయ జర్నలిస్ట్'ను త్వరలో పరిచయం చేస్తా!**

-ఎడిటర్

# సాతాను డేంజరా? ఎవరికి?!

రచన : **పాస్టర్ కె. డానియేల్ అబ్రహామ్** M.Div **(తిరుపతి)**

నేడు అనేక మంది బయపడేది సాతానుకే. ఒక సంఘములో దైవసేవకుడు " Satan is very Dangerous, Care ful" అని అన్నాడు

నిజమే కాని ఎవరికి? పాము డేంజరే కదా, కాని ఆ పామును కూడా ఆడించే పాములోడు ఉన్నాడు కదూ. నేడు నేను ఒక రహస్యాన్ని తెలుపుతాను. అదేమిటంటే, సాతాను కేవలం దేవుని సృష్టి కదా

**'మీ విరోధియైన సాతాను గర్జించు సింహమువలె ఎవరిని మ్రింగుదునా అని తిరుగుచున్నాడు'( 1 పేతురు 5.8)**

గమనించండి... ఏ సింహమైనా మ్రింగునా? ప్రియులారా ఎటువంటి సింహమైనను ఏ జంతువును మ్రింగదు, దాని సహజ స్వభావం అది పట్టుకున్న జంతువును కరచి చంపి వాటి రక్తాన్ని తాగితేనే గాని తృప్తి పొందదు. కాబట్టి అది నిజమైన సింహం కాదుగాని ఇక్కడ చెబుతున్నా... సింహం ప్రపంచ విరోధియైన ఒకప్పటి మనందరి స్నేహితుడు సాతాను. అసలు ఆ సింహానికి ఏం జరిగినదో మీకు తెలుసా?

2000 సం॥లకు ముందు జరిగిన సంఘటన 'యేసు ప్రభువు సిలువలో సాతాన్ని తలను పగులగొట్టి అతని అధికారమంతటిని తానే తీసుకున్నాడు. అప్పుడు తగిలిన గాయముతో సాతానుయొక్క పండ్లన్నీ ఊడిపోయినవి.. కాబట్టి ఇక ఎన్నడును అది నిజమైన సింహము కాదు.

**'ఆయన నిన్ను తల మీద కొట్టును. నీవు ఆయన మడిమె మీద కొట్టెదవు' ( ఆదికాండం 3;15 )**

ఆనాడు సర్పముతో యెహోవా దేవుడు చెప్పిన ప్రవచనం ఇలాగు నెరవేరెను.

భూమ్యాకాశములు గతించినను ఆయన మాటలు పొల్లుపోవు కదూ. అది మాత్రముగాక నేడు సాతానుయొద్ద ఏ అధికారమైనను లేదు ఎందుకంటే

**యేసు - పరలోకమందును భూమి మీదను నాకు సర్వాధికారము ఇయ్యబడియున్నది ( మత్తయి 28;18 )**

సమస్త అధికారములన్ని నేడు మన యేసయ్య సొంతమాయెను. సాతాను కేవలం రాజ్యం కోల్పోయిన, ఓడిన పాత రాజు మాత్రమే. అతనిని చూసి మనం భయపడాల్సిన అవసరంలేదు. సాతాను ఎవరికి డేంజరంటే వాని క్రియలు చేయుచున్న - అతనితో సంబంధమున్న వారికే సాతాను డేంజరు. వారే భయపడాలి గాని మనం కాదు.

**మీరు సైతానుకు చెందిన వాళ్ళు. వాడే మీ తండ్రి.**

**మీ తండ్రి కోరికల్ని తీర్చడమే మీ అభిలాష ( యోహాను 8;44 )**

ఐతే మనలో పాపం ఉన్నట్లయితే మీరు భయపడవచ్చు. ఎంత కాలం ఇలా సైతానుకి భయపడుతు జీవించగలము. మీలో పాపం లేకపోతే మీపై వానికి ఏ మాత్రం అధికారం లేనే లేదు. పరిశుద్ధ గ్రంధమైన బైబిలు చెబుతున్న సత్యము ఏదనగా...

**'పాపం విడిచి పెట్టి లోక మాలిన్యములో చిక్కకుండా తన్ను కాపాడుకొనువానికి ఎటువంటి భయము లేదు, దిగులు లేదు, చింత లేదు' (యాకోబు 1;27 )**

వాని ఆశీర్వాదం వానిని వెతుక్కుంటూ వచ్చును. ఇది నా జీవితంలో ఎన్నో మార్లు జరిగిన, నేను అనుభవించిన సత్యాన్నే తెలుపుతున్నాను. దావీదు రాజు కూడ ఇదే సత్యాన్ని తెలుపుతున్నాడు.

**'నేను బ్రతుకు దినములన్నియు కృపా క్షేమములే నా వెంట వచ్చును' ( కీర్తన 23;6 )**

కృపా క్షేమములు నన్ను వెంబడించాలి, అవును నీలో, నాలో పాపం లేనపుడు ఆశీర్వాదములు మనల్ని వెతుక్కుంటూ వస్తాయి. మనల్ని కృంగదీసే చిన్న చిన్న పాపములను నేడే ఒప్పుకొని ఆయన రక్తముతో కడుగబడి స్వతంత్రులుగా జీవిస్తాం.

సైతాను మీయొద్దకు నేడు వస్తే యేసు చెప్పినట్లు మనం చెప్పగలమా.....

**'ఈ లోకాధికారి వచ్చుచున్నాడు. నాతో వానికి సంబంధమేమియు లేదు ' ( యోహాను 14;30 )**

English Bible Jesus says "He has nothing in me"



మిమ్మును పిలిచినవాడు పరిశుద్ధుడైయున్న ప్రకారం, మీరును సమస్త ప్రవర్తనయందు పరిశుద్ధులైయుండుడి ఇప్పుడు చెప్పండి సాతాను డేంజరా ? ఎవరికి ? రెండు వేషాలు వేస్తూ , పైకి భక్తి వేషంతోనూ అంతరంగములో పాపములను ప్రోత్సహించువారికి సాతాను డేంజరు ....

*ఆత్మీయ జీవిత సత్యం ఏమనగా*

**'యేసు నీలోకి రావాలంటే తలుపు తెరచి రా యేసయ్యా అని పిలువాలి..**
**అయితే సాతాను చిన్న రంధ్రం ఏర్పడితెనే చాలు మీలో ప్రవేశిస్తాడు'**


...నేనును నా ఇంటివారును యెహోవాను సేవించెదము.
వైజాగ్ Vizag Blessed Family Festival
ప్రతి నెల కుటుంబ ఆశీర్వాద పండుగ
నవంబర్ 14
మీ కుటుంబంలో నిజమైన ఆశీర్వాదము కొరకు... పరిశుద్ధాత్మ దేవునితో ఒక సాయంత్రం!
2వ ఆదివారం సాయంత్రం 6 గంటలకు
కళాభారతి ఆడిటోరియం
మద్దిలపాలెం, విశాఖపట్నం.
ప్రసంగికులు బ్రదర్. శామ్యూల్ కర్మోజి
యేసుతో ఆనందం
అందరు ఆహ్వానితులే
వివరాలకు: 99896 55554
ప్రతి గురువారం సా॥ 6:30 గం॥లకు ఆరాధన T.V లో చూడండి





ఉచితం! ఉచితం! ఉచితం! ఉచితం! ఉచితం! ఉచితం!

## ముత్యాల సరాలు | పేదలను ప్రేమించు

నేను చూశాను ఆకలితో అల్లాడి మర్రిచెట్టు క్రింద మరణించిన ముసలివాణ్ణి, వంతెన క్రింద నిండు చూలాలు ప్రసవించి ప్రాణం కోల్పోయిన దృశ్యాన్ని, తల్లిలేక తండ్రి లేక ఏడుస్తూ ఏడుస్తూ ముంజేతుల కళ్ళు తుడుచుకుంటూ మురికి కాలువ ప్రక్కన నిద్రించిన మూడేళ్ళ పసిబాలుణ్ణి, క్షయగ్రస్త భార్య ఇక బ్రతకదని డాక్టరు చెప్పినప్పుడు వణికపోయిన అశక్త చిన్న ఉద్యోగిని, నేను చూశాను మూర్తీభవించిన దైన్యాన్ని, హైన్యాన్ని శవాకార వికారుల్ని. ఈ బాధామయ గాధల్ని వినేదెవరు, పేదల క్షుధార్తి తీర్చేదెవరు. ఇలా చదువుకుంటూపోతే వెంటనే గుర్తుకొచ్చేది.. గుర్తు రావలసింది క్రొత్త నిబంధనలోని (బైబిల్లో భాగం) వాక్యాలు : "దయ గల వారికి దేవుని దయ దొరుకుతుంది", "నిన్ను నీవు ఎలా ప్రేమించుకుంటావో ఇతరులను, పేదవారిని, అలా ప్రేమించు." "అనాథుల్ని, వితంతువులను కష్టాలో ఆదుకో." మానవ కళ్యాణంకోసం సిలువపై ప్రాణాలర్పించిన యేసు జీవిత చరిత్రకూడా వుండే ఆ క్రొత్త నిబంధనకోసం వ్రాయండి (564 పేజీలు) ఉచితంగా పంపిస్తాం.

నిరీక్షణ

ఇదీ అడ్రసు
పోస్ట్‌బాక్స్ నెం.608,సీతమ్మధార,
విశాఖపట్నం-13.

ఉచితం! ఉచితం! ఉచితం! ఉచితం! ఉచితం! ఉచితం!



ఇప్పుడు వెబ్‌సైట్‌లో... క్రైస్తవనాడు www.christavanaadu.com



Rokkam Raju
SHARON SERVICES
REPUTED CHRISTIAN DESIGNERS & PRINTERS
HYDERABAD
CALL : 9247859435, 9705211609


## యేసు చేసిన, చేయమన్న పరిచర్యలంటే ఇవేనా...? - ఎడిటర్

◆ ఆనాధాశ్రమాల పేరిట విలాసాలు వెలగబెడుతున్న మిషనరీలు! ◆ విధవరాండ్ల పెన్షన్ల పేరిట దండుకుంటున్న వారు! ◆ నూనె అమ్ముతారు కొందరు! ◆ రుమాళ్ళు అమ్ముతారు మరికొందరు! ◆ స్వస్థత నేనే ఇస్తానంటాడొకడు! ◆ మా దగ్గరకు రండి మీ దు:ఖదినములు సమాప్తమంటాడింకొకడు! ◆ బీదవాడు మా దగ్గరకొచ్చి ప్రార్థించి బాగుపడ్డాడంటాడొకడు! ◆ ప్రోగ్రాం స్పాన్సర్ చేసి బాగుపడ్డారని.. ఇలా ఎన్నో దిక్కుమాలిన ఉదాహరణలు చెప్తాడొకడు! ◆ చేతి కర్రలు వదిలించి నడిపించి చూపుతూ బాగుపడ్డాడని చెప్తాడు మరొకడు! ఇలా ఎన్నో రకాలుగా ప్రకటించుకుంటారు, స్వస్థత లేక బాగుపడిన వారి అడ్రసు మాత్రం చెప్పరు.

*రాబోవు క్రైస్తవనాడుల్లో పై వాటికి సంబంధించిన వివరణలు వరుసగా వస్తాయి. చదవండి! అలాంటి వారిని నిలబెట్టి ప్రశ్నించి, సరిచేయండి!! మీ దృష్టిలోనూ ఇప్పటికే ఎవరైనా అలాంటివారు ఉంటే మాకు వెంటనే తెలియజేయండి.*



B.R. KUMAR
Those who seek the Lord lack no good thing. (psalm 34:10)
KUMAR CATERING SERVICES
CATERING IN VEG & NON-VEG. MEALS & TIFFINS
D.No. 50-80-21, Gurudwar Jn., Santhipuram, Visakhapatnam- 530016
CELL : 98491 80867, 9966382928




# చెప్పుట మా వంతు! వినుట, వినకపోవుట మీ వంతు!!

## సాక్ష్యాలు తక్కువ! దుర్బోధలెక్కువ?

మీకో సాక్ష్యం. తద్వారా మీ కుటుంబానికో సాక్ష్యం లేకుంటే యేసుక్రీస్తుని మీరేంబోధించగలరు? మీ బోధలైనా వ్రాతలైనా ఏం ఫలిస్తాయి? లోకస్థులు మిమ్మల్ని నిలబెట్టి నీ బ్రతుకేంటి? నీ కుటుంబ పరిస్థితేంటి? అన్న ప్రశ్నలు సంధిస్తే మీరేం చెబుతారు? మీ ద్వారా ప్రభువైన యేసుక్రీస్తుకి తద్వారా తండ్రియైన దేవునికి మహిమా, ఘనతా, ప్రభావాలెలా వస్తాయి? ఆలోచించండి!

## మిషనరీల నిర్వాకాలు!

వీధిలోను, ఊర్లోను గుర్తింపే ఉండదు. గౌరవం అసలే ఉండదు. ఆ ప్రాంతీయుల్లో ఎందరికో వీరెలా ఉంటారోనన్నది తెలియదు. తెల్సిన ఏ కొందరికో, వీళ్లెప్పుడు ఇక్కడుంటారో ఎప్పుడెక్కడుంటారో తెలియదు. కానీ వీళ్ల బుట్టలో పడి క్రీస్తు పరిచర్యల పేరున ధనాన్ని పొగొట్టుకుంటున్న స్వదేశీ, విదేశీ 'దాతలకు' మాత్రం వీరి ఉనికి తెలుస్తుంది. ఆ ధనంతో వీరి ఆస్తులు, విలాసవంతమైన వీరి జీవితాలు మాత్రం వీరుంటున్న ప్రాంతీయులకు కన్పడుతుంటాయి. క్రైస్తవ మిషనరీల పేరున సేవలు వెలగబెడుతున్న అనేక నాయకులు, సంస్థలపై ఆయా ప్రాంతాల్లో క్రైస్తవ, క్రైస్తవేతరుల మధ్య జరుగుతున్న చర్చల సారాంశం ఇది!

## గారడీసీమోన్లు.... ప్రార్థిస్తారట!

అనేకుల అక్కరలు మేం తీరుస్తామంటూ తెగ ప్రచారాలు చేస్తుంటారు. రకరకాల మాయమాటలతో, మంత్రతంత్ర గారడీ విద్యలను ప్రదర్శించునట్లున్న ప్రదర్శనలతో అమాయకులను బురిడీ కొట్టిస్తూ తమ పబ్బం గడుపుకొంటూ తద్వారా విలాసవంత జీవితాలు గడిపేస్తున్న క్రైస్తవబోధకులన్పించుకుంటున్న వారెక్కువై పోతున్నారు. విశ్వాసులూ జర జాగ్రత్త! ఇలాంటోళ్లు బైబిల్లో 'గారడీ సీమోన్ల' కోవకే చెందుతారు. ఎవరైనా చిన్న చిన్న అక్కరతలు వీళ్లకి చెప్పినా సహకరించక... ప్రార్థిస్తామంటారు. అట్టి 'గారడీ సీమోన్లు' క్రీస్తులో దౌర్భాగ్యులే సుమా! గారడీ సీమోన్లు ఇప్పటికైనా మారాలి! ఇవి లేఖనాలు చెబుతున్న నిజాలు! దైవోగ్రత్త మీపై రాకమునుపే మారాలన్నదే బైబిల్లో పట్టున్న అనేకుల కోరిక. ఆ కోరికను మన్నిస్తారో లేక దైవోగ్రతకు పాత్రులౌతారో అట్టి 'గారడీ సీమోన్లే' నిర్ణయించుకోవాలి.

# వేల్పులలో నీవంటివారెవరు?



సహోదరి వివేకవతి. జో
విజయనగరం

**స్వరూపము :** అక్షయమగు మహిమాస్వరూపి ఆత్మస్వరూపి. నిత్యశక్తియు, దేవత్వమునునవి అదృశ్యలక్షణములు ఆత్మస్వరూపియగు పరిశుద్ధుడు.

**నివాసములు :** ఎవరునూ సమీపింపరాని తేజస్సులో ఆయన మాత్రమే నివసించుచూ, అమరత్వము కల్గినవాడు. ఆయన నివాసములు ఎంత రమ్యమైనవి! తేజో మహిమ నిలుచు స్థలములలో నుండువాడు

**పట్టణము :** యెహోవా పట్టణము పరిశుద్ధ పర్వతముల మీద పునాది వేయబడినది. నానా విధరత్నములచే పునాది వేయబడినది.

**సింహాసనము :** ఆయన సింహాసనము. ఆకాశమందు స్థాపింపబడి యున్నది. నీతియు న్యాయమును ఆయన సింహాసనమునకు ఆధారం.

**సన్నిధి :** ఘనతా ప్రభావములు ఆయన సన్నిధిని ఉన్నవి. సర్వలోకనాధుని సన్నిధిని, పర్వతములు మైనమువలె కరగుచున్నవి.

**మాటలు :** యెహోవా మాటలు పవిత్రములైనవి. అట్టివి మట్టి మూసలో ఏడుమారులు ఊదిన వెండి అంత పవిత్రములు. ఆయన మాటలు జీవపు మాటలు ఆయన వాక్కులు నిర్మలమైనవి.

ఆయన వాక్కు వలన ఆకాశములుకలిగెను.

**పాదములు :** అపరంజిని బోలిన పాదములు కలవాడు. ఆయన పాదముల క్రింద నిగనిగలాడు నీలమయమైన వస్తువులు, తేజము ఉన్నవి

**నేత్రములు :** యెహోవా దుష్టత్వమును చూడలేనంత నిష్కళంకమైన దృష్టిగలవాడు. యెహోవా కనుదృష్టి న్యాయము, అగ్నిజ్వాలల వంటి కన్నులు గలవాడు.

**వస్త్రములు :** ఆయన వస్త్రమువలె వెలుగును ధరించియున్నాడు.

**హస్తములు :** నీ (యెహోవా) దక్షిణహస్తము రక్షణార్థమైనది. ఆయన కుడిచేయి నీతితో నిండియున్నది. ఆకాశములు కూడ ఆయనచేతి పనులే. ఆయన హస్తములు నన్ను నిర్మించి రూపు ఏర్పరచెను. భూమ్యాగాధములు ఆయన చేతిలోనున్నవి.

**ముఖము :** మహా తేజస్సుతో సూర్యుని బోలి ఉన్నది. ఆయన ముఖ కాంతిలో రహస్యపాపములు కనబడుచున్నవి.

**పెదవులు :** ఆయన పెదవుల పై దయారసము పోయబడియున్నది.

(వచ్చే సంచికలో)




# తెలుసుకుందాం!

★ జ్ఞానుల పెదవులు తెలివిని వెదజల్లును




❖ వెయ్యేళ్ల క్రితం మధ్య ప్రాచ్యదేశాల్లో ఊదారంగు క్యారెట్లు పండేవి.

❖ దక్షిణాఫ్రికాకు మూడు రాజధానులు ఉన్నాయి. ఒకటి ప్రిటోరియా, రెండోది కేప్‌టౌన్, మూడోది బ్లోయెమ్‌ఫాంటెన్‌లు.. ఇవి మూడు అధికారికంగా ప్రకటించినవే.



❖ ఆరోగ్యంగా ఉన్న మనిషి రోజుకు మూడు గ్యాలన్ల నీరు తాగుతాడు. అంటే నలభై ఎనిమిది కప్పులు.



❖ గ్రీస్ జాతీయగీతం ఆ దేశ పౌరులెవ్వరికీ పూర్తిగా రాదు. ఎందుకంటే అదొక వచన కవితలాగ, 158 వరుసలు (లైన్స్) కలిగి ఉంటుంది. అంత పెద్ద గీతాన్ని గుర్తుపెట్టుకోవటం సాధ్యమయ్యే పనేనా?



❖ యాపిల్ కంపెనీ రూపొందించిన మొదటి హార్డ్‌డ్రైవ్ సామర్థం ఐదు మెగాబైట్స్

❖ 1993లో అమెరికా పికిల్ రీసెర్చ్ (పచ్చళ్ళమీద పరిశోధన) కోసం అక్షరాలా రెండు లక్షల డెబ్బయి ఏడు వేల డాలర్లు ఖర్చుచేసింది.

❖ ఎక్కువ శుభాకాంక్షలు అందుకునే రోజు 'ఫాదర్స్ డే'




❖ పన్నెండు తేనెటీగలు తమ జీవితకాలం కష్టపడితే సుమారు ఒక చెంచాడు తేనె సేకరించగలవు.




❖ టెలిఫోన్‌ను ఉపయోగించిన తొలి అమెరికా అధ్యక్షుడు రూథర్‌ఫోర్డ్ బి.హయెస్. ఆయన ఫోన్ నెంబర్ 1.

❖ చేపలను పచ్చడి పెట్టుకునే పద్ధతి మొదలయింది 1475లో




❖ మిక్కీమౌస్. మిన్నీమౌస్ పాత్రలకు తమ గొంతు అరువిచ్చిన డబ్బింగ్ కళాకారులిద్దరూ నిజ జీవితంలోనూ పెళ్లిచేసుకున్నారు.



# పరిశుద్ధ వివాహం శ్రీనివాస్ వెడ్స్ మాధవి

"He has made everything beautiful in its time" Eccl 3:1







శ్రీ తోట శివరావు (రిటైర్డ్ పోలీస్ ఇన్స్పెక్టర్) గారి చిన్న కుమారుడైన చిరంజీవి శ్రీనివాస్‌కు శ్రీమతి & శ్రీ కె. దానయ్య(విజయవాడ) గారి మూడవ కూమార్తె అయిన చి.సౌ. మాధవికి వివాహ మహోత్సవ శుభాకాంక్షలు

*- బంధుమిత్రులు మరియు స్నేహితులు*


నూతన వధూవరులు శ్రీనివాస్, మాధవి లు

క్రీ.శ. 21-10-2010 తేదిన విశాఖపట్నం సిరిపురంలో గల సెయింట్ పాల్ చర్చ్‌లో చిన బావ అని ఆప్యాయంగా నేను పిలుచుకొనే శ్రీనివాస్ వివాహం సిస్టర్ మాధవితో అత్యంత వైభవోపేతంగా జరిగింది. అందుకు 'దేవునికి స్తోత్రము'. క్రైస్తవనాడు మొన్న ఆగస్టు ప్రత్యేక సంచికలో వీరిని గూర్చి వ్రాసిన 'వ్యాపారస్తులు... అయినా వ్యాకాసక్తులు!' అన్న శీర్షిక పాఠకులకు గుర్తుండే ఉంటుంది. దేవుడు వీరియెడల చేసిన ఈ కార్యాన్ని బట్టి దేవున్ని స్తుతిస్తూ ఈ కుటుంబాన్ని గూర్చి మీ ప్రార్థనలో గుర్తుంచుకోవాలని కోరుతూ...

*-కనకరాజు & ఫ్యామిలీ.*

## ప్రభుత్వం పట్టించుకోవాలి : పాస్టర్ సుందరరాజు

*తూ.గో.జిల్లా, మిమ్మిడి వరం అక్టోబర్ 25 :* ఆల్ క్రిస్టియన్ రైట్స్ ఇండియా యునైటెడ్ కౌన్సిల్ ఆధ్వర్యంలో బైబిల్ మిషన్ స్వస్థిశాల నందు 25-10-2010 వ తారీఖున ఎసిఆర్ఐడి అధ్యక్షులు పాస్టర్ కె. సుందరరాజు తూర్పు గోదావరి జిల్లా ముమ్మిడివరం నందు వందలాదిమంది బోధకుల మధ్య అనేక విషయాలు పంచుకున్నారు. ప్రభుత్వం ద్వారా మనం పొందాల్సిన వాటికై సంఘటితంగా ఉద్యమించాలని పిలుపిచ్చారు. పొందాల్సిన వాటిని గురించి చెబుతూ...



1. ఆంధ్రరాష్ట్రంలో ప్రతీ పట్టణంలో 5 ఎకరాలు బరియల్ గ్రౌండ్ స్థలము మరియు చర్చిలు ఉన్న ప్రతీ గ్రామంలోను ఒక ఎకరా స్థలం 2.ప్రతి మండల కేంద్రంలోను మీటింగ్ గ్రౌండ్ మరియు కమ్యూనిటీ హాల్ నిర్మించాలి. 3. దళిత క్రైస్తవులుగా ఉన్న వారికి తిరిగి దళిత హెూదా కల్పించాలి 4. ప్రస్తుతం అమలులో ఉన్న జి.ఓ. 746/747 ను ఎత్తివేసి, స్వేచ్ఛ కల్పించాలి. తదితర అంశములను వినతి పత్రముల ద్వారా పొన్నాడ సతీష్‌కుమార్ (శాసన సభ్యులు, ముమ్మిడివరం), జి.వి. హర్షకుమార్ (పార్లమెంటు సభ్యులు, అమలాపురం), పి. విశ్వరూప్ (ఆంధ్రరాష్ట్ర గ్రామీణ నీటిపారుదల శాఖామాత్యులు), పేరాబత్తుల రాజశేఖర్ (ఎమ్.పి.పి. ఐ. పోలవరం) లకు అందించారు. నాయకులను కలిసి వినతి పత్రములు అందించిన వారిలో ఎసిఆర్ఐడి అధ్యక్షులు పాస్టర్ కె. సుందరరాజు, జిల్లా కన్వీనర్ పాస్టర్ ఐ. డేవిడ్ రాజు మరియు జిల్లా సేవకులు ఉన్నారు. వినతి పత్రాలపై తగు చర్య ప్రభుత్వం తీసుకొనేట్లు, తద్వారా క్రైస్తవులు లబ్ధిపొందేట్లు సంపూర్ణ సహకారమందిస్తూ తమ వంతు ప్రయత్నం తాము చేస్తామని ఆయా నాయకులు హామీ ఇచ్చారని తెలుస్తోంది. చూడాలిమరి, ఆల్ క్రిస్టియన్ రైట్స్ ఇండియా యునైటెడ్ కౌన్సిల్ అధ్యక్షులు సుందర రాజు ప్రయాస ఎంతవరకు ఫలిస్తుందో! క్రైస్తవులకు లబ్ధి ఎంత చేకూరనుందో!! ప్రభుత్వం ఈ విషయంలో ఎలా స్పందిస్తుందో చూడాల్సిందే!!!



CBCNC
సిబిసిఎన్‌సి
ఐక్య
మహాసభలు
విజయనగరం
JANUARY 2011
ప్రార్థించండి!
పాల్గొనండి!!
స్థలం
ఎస్.ఎమ్.బి. చర్చ్
ఎస్.బి.ఐ. ప్రక్కన

కన్వీనర్
'సంఘమిత్ర'
ఆర్.ఎస్. జాన్
తేదీలు
14,15,16
జనవరి 2011

KERUGMA FESTIVALS
4,5,6 February 2011
కెరుగ్మా (సువార్త ప్రకటన) మహోత్సవాలు
4,5,6 ఫిబ్రవరి 2011 (శుక్ర, శని, ఆది)
జీవజలములు రేడియో పరిచర్య ఆధ్వర్యంలో, వైజాగ్ సుబ్బలక్ష్మి కళ్యాణ మండపం గ్రౌండ్‌లో జరుపబడును.



*Printed ,Published , Edited and Owned by Y.Kanaka Raju, 3-178, 5th Lane, Adarsh Nagar, Visakhapatnam - 530 040, Andhra Pradesh.*
*Ph : 9346960601,9490266640. E-mail: y_kanakaraju1@yahoo.co.in., Printed at Vinay Offset Printers, Premasamajam Road, Dabagardens, Visakhapatnam - 20*